క్లుప్తంగా

వార్డు మెంబర్‌గా ప్రమాణస్వీకారం



నాగమ్మను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి

కొత్తపల్లి: స్థానిక 10వ వార్డు మెంబర్‌గా తొప్పెట నాగమ్మ బుధవారం స్థానిక సచివాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచు లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి చిన్నస్వాములు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నాగమ్మను సర్పంచు, నాయకులు పూలమాల, దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చింతమాను శ్రీనివాసులు యాదవ్, నాగ ఎల్లయ్య, మొల్ల బాషా పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధికి సీసీ రోడ్ల నిర్మాణం



సీసీరోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధి కోసం సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతోందని పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రానాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శివపురం గ్రామంలో వేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. రోడ్డును డ్రిల్ చేసి నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతి అభివృద్ధికి రూ.20 లక్షలు కేయించిందన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ మాధవ ప్రసాద్, పీఆర్ ఏఈ రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

పింఛన్ దరఖాస్తులపై విచారణ



దరఖాస్తుదారురాలి ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: కొత్త పింఛన్ల దరఖాస్తులపై ఎంపీడీఓ గోపీకృష్ణ బుధవారం విచారణ చేశారు. మండలంలోని బానకచెర్ల, పాములపాడు గ్రామాల్లో వికలాంగులు, మంచానికి పరిమితమైన పింఛన్ దారుల ఇళ్ల వద్దకు వెళ్లి ధ్రువీకరణ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 158 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో దరఖాస్తులు 95శాతం ధ్రువీకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఇద్దరు దరఖాస్తుదారులు మృతి చెందారని, వాటిని తిరస్కరించినట్లు తెలిపారు. ముగ్గురు అందుబాటులో లేకపోవడంతో పెండింగ్‌లో ఉంచామన్నారు.

641 మంది కొత్త ఓటర్ల నమోదు

వెలుగోడు: మండలంలో కొత్తగా 641 మంది ఓటు హక్కును నమోదు చేయించుకున్నారని తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా బీఎల్వోలు నెల రోజులపాటు ఓటర్ల జాబితా వెరిఫికేషన్ చేపట్టారన్నారు. 480 మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించామన్నారు. 716 దరఖాస్తులను మార్పులు చేర్పులతో సవరించామన్నారు.

రికార్డులు సమర్పించాలి

కొత్తపల్లి: ఫీల్డ్ అసిస్టెంట్లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిచేసిన పనుల రికార్డులను సమర్పించాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పూర్తిచేసిన పనులకు చెందిన మస్టర్లు, ఫొటోలు, పే ఆర్డర్లు, గ్రామసభ తీర్మానాలు అన్ని రికార్డులు తప్పకుండా సరిచూసుకోవాలన్నారు. 28వ తేదీ నుంచి కేంద్ర బృందం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేసేందుకు వస్తున్నారని తెలిపారు.

వైద్యసేవల్లో లోపాలుంటే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

మహానంది: వైద్యసేవల్లో లోపాలుంటే కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కేసులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వైద్యసేవలు అందించాలన్నారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ జగదీశ్వరరెడ్డి, డాక్టర్ శ్రీమంత్,

చంద్రయాన్‌-3 విజయవంతంపై సంబరాలు





పగిద్యాలలో బాణాసంచా కాలుస్తున్న దృశ్యం, పాములపాడులో జాతీయ జెండాతో సంబరాలు

పాములపాడు: ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్ -3 విజయవంతం కావడంపై బుధవారం రాత్రి మండల కేంద్రంలో జాతీయ జెండాతో గ్రామస్తులు సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, గ్రామస్తులు జనార్దన్ శెట్టి, చంద్రుడు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో చంద్రయాన్ -3 విజయంపై బుధవారం సంబరాలు జరిపారు. గ్రామస్తులు జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ఇస్రో శాస్త్రవేత్తల ఖ్యాతిని కొనియాడారు.

మహానందిలో నందీశ్వరుడికి విశేష పూజలు

మహానంది: మహానంది క్షేత్రంలో బుధవారం రాత్రి నందీశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. చంద్రయాన్‌-3 సక్సెస్ అవ్వడంతో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు సర్వశాస్త్రములు, యంత్రాలకు అధిపతి అయిన నందీశ్వరుడికి విశేష పూజలు చేపట్టారు.

జూపాడుబంగ్లా: చంద్రయాన్‌-3 విజయవంతం కావడంతో విద్యార్థులు, పిల్లలు, పెద్దలు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. సాయంత్రం 5.44గంటలకు ప్రారంభమైన విక్రమ్ ల్యాండర్ సేఫ్టీ ల్యాండిగ్ ప్రక్రియను పిల్లలు,పెద్దలు ఉత్కంఠభరితంగా కళ్లు ఆర్పకుండా టీవీల్లో చూశారు. విక్రమ్ ల్యాండర్ 6.04 గంటలకు చంద్రునిపై సేఫ్టీగా ల్యాండ్ కావటంతో పిల్లలు, పెద్దలు చప్పట్లు చరుస్తూ సంతోషం వ్యక్తంచేస్తూ.. జయహోభారత్ అంటూ నినాదాలు చేశారు.



మహానందిలో పూజలు చేస్తున్న ఈఓ, చైర్మన్

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

ఆత్మకూరు: చంద్రయాన్‌-3 విజయానికి కారకులైన ప్రతి ఒక్క ఇస్రో శాస్త్రవేత్తకు ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. చందమామపై ఇస్రో శాస్త్ర వేత్తలు పంపిన చంద్రయాన్- 3 ల్యాండై విజయం సాధించిన అనంతరం బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా చంద్రయాన్ విజయం సాధించడం, అది మన రాష్ట్రంలో శ్రీహరికోట నుంచి పంపడం మనకు గర్వకారణమన్నారు. రష్యా సాధించలేని విజయం భారత్ సాధించిందని చెప్పారు. ఇలాంటి ప్రయోగాలు మరెన్నో చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అలాగే పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ఏడు గంటల పాటు నాణ్యమైన విద్యుత్

- వర్షాలు కురవకనే విద్యుత్ సమస్యలు
- రెండు వేల మెగా వాట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది
- ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి రెండు గ్రూపులుగా విద్యుత్ సరఫరా
- ఏడీఈ శ్రీనివాసులు



శ్రీనివాసులు

నందికొట్కూరు: రైతులు వేసిన పంటలు ఎండిపోకుండా ఏడు గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణపట్నంలోని థర్మల్ విద్యుత్ కేంద్రంలో 1200 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. కడపలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఒక యూనిట్, విజయవాడలోని థర్మల్ పవర్ ప్లాంట్ ఒక యూనిట్ నిలిచిపోయిందని చెప్పారు. మనకు రావాల్సిన 2 వేల మెగా వాట్ల విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో మూడు రోజుల నుంచి సమస్య తలెత్తిందన్నారు. పవన విద్యుత్ ఉత్పత్తి లేకపోవడంతో డిమాండ్, సరఫరాకి వ్యత్యాసం ఏర్పడిందని చెప్పారు. ఎమర్జెన్సీలోడు రిలీఫ్ ఏర్పాటు చేయడంతో రైతులకు కొంత మేరకు విద్యుత్ అందించలేకపోయామన్నారు.

లోడును తగ్గించేందుకు రెండు గ్రూపులుగా విభజన

ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఉదయం 4 నుంచి 11 గంటల వరకు ఒక గ్రూపునకు, 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రూపునకు వ్యవసాయానికి విద్యుత్ ఏడు గంటల పాటు సరఫరా చేస్తునట్లు వెల్లడించారు. ఎత్తిపోతల పథకాల మోటార్లు ఆన్ చేయడంతో రైతులకు పగటి పూట 9 గంటలు కరెంట్ ఇస్తే ఓవర్ లోడుతో విద్యుత్ సమస్యలు వస్తాయని చెప్పారు. అందుకే రెండు గ్రూపులుగా విభజించి నాణ్యమైన కరెంట్ ఇస్తున్నాన్నారు. నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాలు కలిపి బోరుబావుల మోటారు వ్యవసాయ రైతు విద్యుత్ కనెక్షన్లు 10 వేల వరకు ఉన్నాయని చెప్పారు. గృహాలు, పరిశ్రమలు, వాణిజ్యం కలిపి 60 వేలు కనెక్షన్లు ఉన్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో విద్యుత్ ఏఈ రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వాగ్దానాలు నమ్మకండి



గ్రామస్తులు, నాయకులతో కలిసి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి
- పేదల జీవితాల్లో మార్పులు తెస్తున్న సీఎం జగన్
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



గడప గడపకు ముగింపు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: రాజకీయ లబ్ధికోసం ప్రతిపక్షాలు ఇస్తున్న తప్పుడు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో రెండోరోజు బుధవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల యువనేత ఒంటెద్దు వీరారెడ్డి ఆధ్వర్యంలో దారిపొడవునా పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లపాలనలో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ, జనసేన, వంటి పార్టీలు ప్రజలను మోసం చేసేందుకు ప్రజల్లోకి వస్తున్నాయని, వీరి మాయమాటలు నమ్మొద్దని సూచించారు.

పీర్ల జార్తలకు రూ. 30వేలు విరాళం

తిమ్మాపురంలో నిర్వహించనున్న పీర్లజార్తలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ. 30వేలు విరాళం అందించారు. మున్ముందు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే వివిధ రుగ్మతలతో బాధపడుతున్న కొంత మంది బాధితులకు రూ. 25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గడపగడపకు కార్యక్రమం మండలంలో అన్ని గ్రామాల్లో విజయవంతంగా ముగిసిన సందర్భంగా యువనేత ఒంటెద్దు వీరారెడ్డి స్వగృహం వద్ద వేలాది మంది మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు శిరిగిరి పెద్ది స్వరూప, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైస్ సర్పంచ్ ఎస్ఎన్ రేష్మ, సింగిల్ విండో చైర్మన్ పగడాల నాగరాజు, మాజీ చైర్మన్ బాలీశ్వరరెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోపాల్‌రెడ్డి, పగడాల బాలచంద్రుడు, ఒంటెద్దు సిద్దార్థరెడ్డి, కల్లె మద్దిలేటి, ఎర్రన్న, నాగశేఖర్‌రెడ్డి, మందా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. అధికారులకు ఆదేశాలిస్తూ..

- హుషారుగా సాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- సచివాలయం-1లో పరిధిలో ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే ఆర్థర్
- చంద్రయాన్ -3 విజయవంతంపై శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు



ఈదమ్మ సమస్యను వింటున్న ఎమ్మెల్యే ఆర్థర్



గ్రూప్-1 విజేత బాలగోవిందును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పగిద్యాల: స్థానిక గ్రామ సచివాలయం-1లో బుధవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జోరుగా.. హుషారుగా సాగింది. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు వింటూ.. పరిష్కారానికి నోట్ చేసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇస్తూ వడివడిగా ముందుకు అడుగులు వేసి మొదటి రోజే 770 ఇళ్లను సందర్శించి అందరిలో జోష్ పెంచారు. ఇంటింటికి మూడో ఏటా సంక్షేమ బావుటా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొల్ల ఈదమ్మ తన కుమారుడు ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగం చేస్తూ మృతి చెందాడని, అతని కుటుంబానికి ఆసరాగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇప్పించాలని ఎమ్మెల్యేతో వాపోయింది. వృద్ధురాలి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే చదువుకున్న వారు ఉంటే తప్పకుండా సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కుంటవీధిలో నీలమ్మకు ఇంటి పట్టా రాలేదని పుస్తకంలో ఇచ్చినట్లు వచ్చిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వెంటనే ఇంటి పట్టా మంజూరు చేయాలని వీఆర్వో నాగన్నకు వివరాలు నోట్ చేసుకోవాలని ఆదేశించారు. కేసీ కాలువకు సాగునీరు ఎంత వరకు వస్తాయని వనుములపాడు క్రిష్ణ అనే రైతు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో నీటి మట్టం ఉన్నంత వరకు నీటి విడుదల ఉంటుందని అధైర్యపడొద్దని తెలిపారు. ఇంకా పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని నోట్ చేసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడిపైకి పంపించిన చంద్రయాన్‌-3 ల్యాండర్ సురక్షితంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగడంతో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపి బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సగినేల రమణ, జయరామిరెడ్డి, చిట్టిరెడ్డి, జయభారత్‌రెడ్డి, పాలమర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం

గ్రూప్ -1 ఫలితాలలో విజయం సాధించి అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికైన పగిడ్యాల వాసి బాలగోవిందును ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ బాలగోవిందుకు సంక్షేమ బావుటా పుస్తకాన్ని పంపిణీ చేశారు. గ్రూప్ -1 ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే శాలువా తెప్పించి వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని సంగయ్యపేటకు చెందిన షేక్ మదార్‌మియ్యా (51) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపారు. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి వెళ్లి ఇంత వరకూ తిరిగి రాలేదన్నారు. ఎత్తు 5. 2 అడుగులు, నలుపు కలరు ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్ ఫోన్ 08513–280333 నంబరుకు సమాచారం తెలియజేయాలని కోరారు.

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు

కొత్తపల్లి: సుమారు 20 రోజులుగా వర్షాలు కురువడం లేదు. రైతులు ఖరీఫ్‌లో సాగుచేసుకున్న పంటలు కాస్తా ఎండుముఖం పడుతున్నాయి. వర్షం కోసం బుధవారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలోని క్రైస్తవులు నీటిమునక పొలాలలో ప్రత్యేక ప్రార్థన కూడిక ఏర్పాటు చేసుకొని ప్రార్థించారు. అక్కడే వంటావార్పుచేసి, నందికుంట గ్రామంలోని బొడ్రాయికి నీటితో అభిషేకం చేసి, కాయకర్పూరం సమర్పించి, పూలతో అలంకరించి పాయసం పంచిపెట్టారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాములపాడు: స్వచ్ఛ భారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు రామ్‌నాయక్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తా చెదారాన్ని సేకరించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో స్వచ్ఛ భారత్ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నాన్నారు. 18 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్రావు, కార్మికులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలో 95 మందికి నూతన పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తర్తూరు గ్రామానికి 8, 80 బన్నూరు-9, జూపాడుబంగ్లా-13, మండ్లెం -15, తంగడంచ-3, పారుమంచాల-15, తరిగోపుల-7, తాటిపాడు-11, తూడిచెర్ల-14 పింఛన్ల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. పింఛన్లు మంజూరైన లబ్దిదారుల వివరాలు, వారి అర్హత సర్టిఫికెట్లను పరిశీలించినట్లు తెలిపారు. వీరికి సెప్టెంబర్ మాసం నుంచి నూతన పింఛన్ నగదు అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపరెంటెంటు జ్యోతి, సీనియర్ అసిస్టెంటు మద్దమ్మ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బైక్ యాత్రను జయప్రదం చేయండి

ఆత్మకూరు: విద్యారంగ అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ బైక్‌యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని థెరిస్సా జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నంద్యాల జిల్లాలో విద్యా రంగం అభివృద్ధి కోసం బైక్‌యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రేమ్‌సాగర్ , గంగాధర్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో దేవదాయశాఖ మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం రాత్రి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు.



మంత్రికి ఆహ్వానం పలుకుతున్న ఈఓ

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు లాభసాటి



పత్తి సాగును పరిశీలిస్తున్న సైంటిస్టు ధనలక్ష్మి

మిడుతూరు: అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేపడితే లాభసాటిగా ఉంటుందని యాగంటిపల్లి కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలపరిధిలోని దేవనూరు రైతు భరోసా కేంద్రంలో కేంద్రియ పత్తి పరిశోధన కేంద్రం నాగపూర్ వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు ప్రాజెక్టుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఈ విధానంలో (స్వల్పకాలిక రకాలు) విత్తు కోవడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, సైంటిస్టు బాలరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ దేవా తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరులో వైఎస్సార్ పొలం బడి

మండలకేంద్రమైన మిడుతూరులో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు బుధవారం నిర్వహించారు. గులాబీరంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఓ పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

వరి పంట సాగు చేయొద్దు

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వ కింద ఆయకట్టు రైతులు వరి పంటలు సాగుచేసుకోవద్దని కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీ కాల్వకు సుంకేసుల, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల నుంచి 1,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని రైతులు వినియోగించుకోగా లాకిన్స్‌లా వరకు 610 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. వీటిని తూడిచెర్ల సబ్ ఛానల్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కేసీ కాల్వకు సాగునీరు ఎప్పటిదాకా వస్తుందనే వివరాలు స్పష్టంగా వెల్లడించలేమన్నారు. శ్రీశైలం డ్యాంలో క్రమేణా నీటిమట్టం తగ్గుతున్నందున మరో పదిరోజులు కేసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేసే అవకాశాలుండవచ్చని చెప్పారు. కేసీ కాల్వ కింద ఆయకట్టు రైతులు త్వరగా ఓ తడి నీటిని పారించుకోవాలన్నారు.

గిరిజన గూడేల్లో సమగ్ర సర్వే

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని ప్రకాశం జిల్లాలో చెంచుగూడేల్లో సమగ్రసర్వే నిర్వహణపై బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. సమగ్ర సర్వే కోసం సూపర్‌వైజర్లు, సహాయక సిబ్బందిని నియమించారు. గూడేల్లో మౌలిక వసతులపై సర్వేను త్వరితంగా చేపట్టి నివేదికలు ఈ నెలాఖరులోగా ఇవ్వాలని ఆదేశించారు.

బాల్య వివాహాల నియంత్రణకు నడుం బిగిద్దాం



మాట్లాడుతున్న సీడీపీఓ కోటేశ్వరమ్మ

పగిడ్యాల: బాల్య వివాహాల నియంత్రణకు నడుం బిగిద్దామని నందికొట్కూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్ పిలుపునిచ్చారు. వివాహ వయస్సు వచ్చాకే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బాల్య వివాహాల నియంత్రణపై ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడ పిల్లలకు పదో తరగతి చదువు పూర్తయితేనే పెళ్ళిళ్లు చేసి పంపడం బాధాకరమన్నారు. తక్కువ వయస్సు పిల్లలకు పెళ్లిళ్లు చేయడం వలన భవిష్యత్‌లో వారు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని వివరించారు. చట్ట ప్రకారం ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన వారే పెళ్లికి అర్హులని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఏపీఎం శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

మిడుతూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ కోటేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండలపరిధిలోని వైకేపీ కార్యాలయంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మారుతిశంకర్, ఏపీఎం సుబ్బయ్య పాల్గొన్నారు.

ముఖద్వార నిర్మాణానికి శాప్ చైర్మన్ విరాళం

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి దేవి క్షేత్రానికి వెళ్లే రహదారిలో ఆలయ ముఖద్వార నిర్మాణానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. బుధవారం శివపురం గ్రామంలో కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్ కొలనుభారతి దేవి సేవసమితి కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఆయన మాట్లాడుతూ శివపురం గ్రామంలో కొలనుభారతిదేవి క్షేత్రానికి వెళ్లే రహదారిలో భక్తుల సౌకర్యార్థం ఆర్చి నిర్మాణం జరుగుతోందన్నారు. ఇందుకోసం కమిటీ సభ్యులు శాప్‌చైర్మన్‌ను కలిసి విరాళం అడిగారన్నారు. ఈ మేరకు ఆయన నగదును పంపారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శివన్న, మాజీ సర్పంచులు శ్రీనివాసులు యాదవ్, తలారి రామకృష్ణుడు, ఎర్రం వెంకటయ్య యాదవ్, బోయ వెంకటశివుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ కోతలపై రైతుల నిరసన

నందికొట్కూరు రూరల్/పగిద్యాల/జూపాడబంగ్లా: నందికొట్కూరు మండలంలోని కొణిదేల, బొల్లవరం గ్రామాలలో, పగిడ్యాలలోని సబ్ స్టేషన్ల వద్ద రైతులు వ్యవసాయ విద్యుత్ కోతలకు నిరసనగా బుధవారం రైతులు ధర్నా చేశారు. జూపాడుబంగ్లా మండలలోని మండ్లె సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం అర్ధరాత్రి కేజీ రోడ్డుపై బైఠాయించారు. రైతులకు పగటిపూట 9గంటల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని కోరారు. నందికొట్కూరు మండలంలోని బొల్లవరం గ్రామంలో కేజీ రోడ్డుపై ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను అడ్డుగా ఉంచి పురుగు మందు డబ్బాలను చేతబట్టి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాసులు, ఏఈ రామ్‌నాయక్ , పోలీసులు రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

పాములపాడు: వ్యవసాయానికి 9గంటల విద్యుత్ సరఫరా చేయాలని లింగాల, చెలిమిల్ల, పాములపాడు కు చెందిన రైతులు బుధవారం కేజీరోడ్డు పై బైఠాయించి సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

పాములపాడు: ప్రజల నుంచి సమస్యలపై వచ్చే అర్జీలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం- స్పందనకు ప్రజల నుంచి వచ్చే సమస్యలపై ఆయా శాఖల అధికారులు ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. మండల కమిటీ అధికారులు డాక్టర్ గులాబ్‌షా, ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్ : ఉమ్మడి ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డి ఇతర శాఖల అధికారులు ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. అలాగే తెలుగు భాష వార్షోత్సవాల సందర్భంగా తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కేవీఎస్ఎన్ కుమార్, డీఈ లత, డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ డా.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఐటీడీఏ, ఇతర శాఖల అధికారులు